# రెపోతో ద్రవ్య సరఫరా.. రివర్స్ రెపోతో ద్రవ్యోల్బణం నియంత్రణ




**1. ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రాంతీయ సమావేశం ఎక్కడ జరిగింది? (బి)**

ఎ) భారతదేశం- న్యూఢిల్లీ
బి) జార్జియా టిబిలిసి
సి) ఇండోనేషియా- జకర్తా
డి) ఉగాండా-కంపాలా

**వివరణ:** ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రాంతీయ సహకార సమైక్యతా సమావేశాన్ని 2023 సెప్టెంబర్ 5 నుంచి 7వరకు జార్జియా రాజధాని టిబిలిసిలో నిర్వహించారు.

- ఈ సమావేశంలో ఆసియా అభివృద్ధి బ్యాంకు సభ్యదేశాల్లో 30 కంటే ఎక్కువ దేశాలు పాల్గొన్నాయి.
- ఈ సమావేశంలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఆర్థిక కారిడార్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ప్రాంతీయ సహకారం, సమగ్రతలను బలోపేతం చేసే అంశంపై దృష్టి కేంద్రీకరించారు.
- ఆర్థిక అభివృద్ధి కారిడార్‌లో పెట్టుబడులు పెట్టే ప్రాజెక్టుల కోసం ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం, మార్గదర్శక సూత్రాల రూప కల్పన మొదలైన అంశాలమీద సమాచారాన్ని సభ్యదేశాల మధ్య పంచడం కోసం కృషి చేయడం దీని లక్ష్యం.
- ఈ సమావేశంలో భారత ప్రతినిధి పాల్గొని ప్రధాన మంత్రి గతి శక్తి జాతీయ మాస్టర్ ప్రణాళిక గురించి వివరించారు. అంతే కాకుండా దేశీయంగా అభివృద్ధి చేసిన జీఐఎస్ ఆధారిత సాంకేతికతల సహాయాన్ని ఇతర సభ్యదేశాలకు అందిస్తుంది. అంటే దక్షిణాసియా ఉప ప్రాంతీయ ఆర్థిక సహకార వేదిక సభ్య దేశాలకు కూడా ఈ సాంకేతికతను అందించడం, సామాజిక, ఆర్థిక ప్రణాళికల ద్వారా ప్రాంతీయ సహకారాన్ని పెంచేందుకు భారతదేశం ముందుకు వచ్చింది.

**ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ):** ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో సామాజిక ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో 1966 డిసెంబర్ 19న స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఉంది.

- ఆసియాలోనే తొలి పారిశ్రామిక దేశంగా గుర్తింపు పొందిన జపాన్ సారథ్యంలో ఈ ఏడీబీని ఏర్పాటు చేశారు.
- ఆసియాలో ఆర్థిక, సామాజిక అభివృద్ధిని ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం.
- ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రారంభంలో 31 సభ్య దేశాలు ఉండగా ప్రస్తుతం 68 సభ్యదేశాలకు చేరుకుంది. వీటిలో 49 దేశాలు ఆసియా - పసిఫిక్ ప్రాంతానికి చెందిన దేశాలు కాగా 19 ప్రాంతీయేతర దేశాలు ఉన్నాయి.
- ఏడీబీలో భారతదేశం వ్యవస్థాపక సభ్యదేశం.
- 2022 డిసెంబర్ 31 నాటికి ఏడీబీలో అత్యధిక వాటాలు కలిగిన 5 దేశాలు జపాన్ (15.6%), అమెరికా(15.6%), చైనా (6.4%), భారతదేశం (6.3%), ఆస్ట్రేలియా(5.8%)

**2. 2023 సెప్టెంబర్ నెలలో సేకరించిన కేంద్ర జీఎస్టీ ఆదాయం ఎంత? (బి)**

ఎ) రూ. 1.60 లక్షల కోట్లు
2) రూ. 1.62 లక్షల కోట్లు
3) రూ. 1.65 లక్షల కోట్లు
4) రూ. 2.15 లక్షల కోట్లు

**వివరణ:** జీఎస్టీ వసూళ్లు సెప్టెంబర్ నెలలో 10 శాతం వృద్ధితో రూ. 1.62 లక్షల కోట్లకు చేరినట్లు కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన గణాంకాలు పేర్కొన్నాయి. ఇందులో కేంద్ర జీఎస్టీ రూ 29,818 కోట్లు.

- రాష్ట్ర జీఎస్టీ రూ. 37,657 కోట్లు, ఐజీఎస్టీ రూ.83,623 కోట్లు, సెస్ రూ. 11,613 కోట్లుగా ఉన్నాయి.
- గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఇవి రూ. 1.47 లక్షల కోట్లు కాగా ఈ సంవత్సరంలో జీఎస్టీ వసూళ్లు రూ. 1.60 లక్షల కోట్లను మించడం ఇది నాలుగోసారి.

**3. ఆర్థిక స్థిరత్వ నివేదిక (ఎఫ్ఎస్ఆర్) అనేది ఏ సంస్థ ప్రధాన ప్రచురణ? (బి)**

ఎ) బీఎస్ఈ బి) ఆర్‌బీఐ
సి) నీతి ఆయోగ్ డి) ఐఎంఎఫ్

**వివరణ:** రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సంవత్సరానికి రెండుసార్లు అంటే ప్రతి జూన్, డిసెంబర్‌లో ఆర్థిక స్థిరత్వ నివేదిక (ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్- ఎఫ్ఎస్ఆర్)ను విడుదల చేస్తుంది.

- ఎఫ్ఎస్ఆర్ ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన నష్టాలపై ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్‌డీసీ) సబ్‌కమిటీ సామూహిక అంచనాలను ప్రతిబింబిస్తుంది. అదే విధంగా ఆర్థిక వ్యవస్థ స్థితి స్థాపకతను కూడా సూచిస్తుంది.
- ఆర్థిక స్థిరత్వ నివేదిక - జూన్ 2023 ప్రకారం షెడ్యూల్ వాణిజ్య బ్యాంకులు (SCBs), స్థూల నిరర్థక ఆస్తుల(జీఎన్‌పీఏ) నిష్పత్తి ఏడేళ్ల కనిష్ట స్థాయి 5.0 శాతానికి పడిపోయింది. సెప్టెంబర్ 2022లో నికర నిరర్థక ఆస్తులు (ఎన్ఎన్‌పీఏ) పదేళ్ల కనిష్ట స్థాయి 1.3 శాతానికి పడిపోయింది.

**4. ముద్ర అంటే ఏమిటి? (ఎ)**

ఎ) మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ
బి) అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కోసం పథకం
సి) అర్బన్ టౌన్‌షిప్ డెవలప్‌మెంట్ కోసం పథకం
డి) న్యూప్లానెట్ ఏర్పాటు కోసం పథకం

**వివరణ:** MUDRA-Micro Units Development and Refinance Agency

- ముద్ర అనేది మైక్రో ఫైనాన్స్ సంస్థలు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌లకు తక్కువ రేటుకు రుణాలను అందించే ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థ.
- ముద్రను భారత ప్రధాని నరేంద్రమోదీ2015 ఏప్రిల్ 8న ప్రారంభించారు.
- ముద్ర / ముద్ర బ్యాంక్ అనేది గ్రామీణ, అంతర్గత భాగాలలో నివసించే ప్రజలకు ఆర్థిక పరంగా ప్రయోజనం చేకూరుస్తుంది. ఇది భారతీయ ఎంఎస్ఎంఈ రంగ అభివృద్ధికి సహాయపడుతుంది. / క్రెడిట్‌ను అందిస్తుంది. మనదేశ జీడీపీని పెంచడానికి కూడా సహాయపడుతుంది.
- ముద్ర చిన్న తరహా పారిశ్రామికవేత్తల్లో నూతన విశ్వాసాన్ని సృష్టిస్తుంది.
- యువకులు విద్యావంతులు లేదా నైపుణ్యం కలిగిన కార్మికులను వారి కార్యకలాపాలను విస్తరించడానికి కూడా ముద్ర ప్రోత్సహిస్తుంది. అంటే స్వయం సమృద్ధి సాధించుకోవడానికి తగిన ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది.
- ముద్ర పథకం ప్రత్యేకంగా మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తుంది. ఇది మహిళా సాధికరతకు దారితీస్తుంది. దేశ నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషిస్తుంది.

**5. 2023 సంవత్సరానికి అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రొఫెసర్ క్లాడియా గోల్డిన్‌కు ఏ పరిశోధనకు లభించింది? (డి)**

ఎ) శతాబ్దాలుగా మహిళల సంపాదన, లేబర్ మార్కెట్ ఫలితాలపై పరిశోధన
బి) లేబర్ మార్కెట్‌లో మహిళా కార్మిక ఉత్పాదక శక్తిపై పరిశోధన
సి) కార్మిక మార్కెట్‌లో మహిళల భాగస్వామ్యం - సమస్యలు- పరిష్కారం
డి) పైవన్నీ

**వివరణ:** ప్రతిష్ఠాత్మక అర్థశాస్త్ర నోబెల్ బహుమతిని 2023 సంవత్సరానికి అమెరికాకు చెందిన ప్రొఫెసర్ క్లాడియా గోల్డిన్‌కు శతాబ్దాలుగా మహిళల సంపాదన, కార్మిక మార్కెట్‌లో మహిళల భాగస్వామ్యం, సమస్యలు -పరిష్కారం, వాటి ఫలితాలపై పరిశోధనకుగాను రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది.

- 1946లో న్యూయార్క్‌లో జన్మించిన క్లాడియా గోల్డిన్ శతాబ్దాలుగా మహిళల సంపాదన, కార్మిక మార్కెట్ భాగస్వామ్యానికి సంబంధించిన మొదటి సమగ్ర నివేదిక ఖాతాను అందించారు.
- శ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని అర్థం చేసుకోవడం, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కనుక్కోవటం, లింగ అంతరాలపై ప్రధానంగా పరిశోధనలను వెల్లడించారు.
- అమెరికాలోని హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో కార్మిక ఆర్థిక వేత్తగా పనిచేస్తున్న క్లాడియా గోల్డిన్ ఆర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్న మహిళల్లో మూడో వ్యక్తి. 2009లో ఎలినోర్ ఓస్ట్రోమ్ మొదటివారు కాగా 2019లో ఎస్తేర్ డుఫ్లో రెండోవారు.
- గత సంవత్సరం అంటే 2022లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందిన అమెరికన్ ఆర్థిక వేత్తలు డగ్లస్ డైమండ్, ఫిలిప్ డైబ్‌విగ్, బెర్నాంకేలతో కలిసి సంక్షోభ సమయంలో బ్యాంకులపై పరిశోధనకుగాను 10 మిలియన్ల స్వీడిష్ క్రోనార్లు అందజేయగా ఈ సంవత్సరం బహుమతి విలువను 11 మిలియన్ల క్రోనార్లకు పెంచారు.
- ఈ నోబెల్ బహుమతి విజేతలకు డిసెంబర్ 10న బహుమతులను ప్రదానం చేస్తారు.

**ఇప్పటివరకు నోబెల్ బహుమతి పొందిన భారతీయులు**

- రవీంద్రనాథ్ ఠాగూర్ 1913- సాహిత్యంలో లభించింది.
- సి.వి.రామన్ 1930- భౌతిక శాస్త్రం
- హరగోవింద్‌ఖొరానా 1968- ఫిజియాలజీ / మెడిసిన్
- మదర్ థెరిసా 1979 - శాంతి రంగం
- సుబ్రమణ్యం చంద్రశేఖర్ 1983 - భౌతిక శాస్త్రం
- అమర్త్యసేన్ 1998 - అర్థశాస్త్రం
- వెంకట్రామన్ రామకృష్ణన్ 2009 - రసాయన శాస్త్రం
- కైలాష్ సత్యార్థి 2014 - శాంతి రంగం
- అభిజిత్ బెనర్జీ 2019 - ఆర్థిక శాస్త్రం

**6. రెపోరేటు భావనను ఆర్‌బీఐ ఏ సంవత్సరంలో ప్రవేశ పెట్టింది? (సి)**

ఎ) 1990 బి) 1991
సి) 1992 డి) 1995

**వివరణ:** రెపోరేటు అనేది రీ పర్చేజింగ్ ఆప్షన్ రేట్‌కి సంక్షిప్త రూపం. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాను నియంత్రించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కేంద్రబ్యాంకులు రెపోరేటు ను కీలక ద్రవ్య సాధనంగా ఉపయోగిస్తాయి.

- భారతదేశంలో రెపోరేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షిస్తుంది
- రెపోరేటు భావనను వాఘుల్ వర్కింగ్ గ్రూప్ సూచించింది.
- రెపోరేటు భావనను ఆర్‌బీఐ 1992 డిసెంబర్ 10 నుంచి ప్రవేశ పెట్టినది.
- రెపో అంటే షార్ట్‌టెర్మ్ లెండింగ్ రేటు.
- రెపో అనే పదం తిరిగి కొనుగోలు చేసే ఎంపిక లేదా మళ్లీ కొనుగోలు ఒప్పందం అనే పదబంధాల నుంచి ఉద్భవించింది.
- రెపోరేటు అనేది వాణిజ్య బ్యాంకులు సెక్యూరిటీ, బాండ్లపై ఆర్‌బీఐ నుంచి ద్రవ్యాన్ని తీసుకునే రేటును సూచిస్తుంది.
- ఆర్‌బీఐ నుంచి వాణిజ్య బ్యాంకులు తీసుకునే స్వల్పకాలిక రుణాలపై విధించే వడ్డీరేటును 'రెపోరేటు' అని 'రీపర్చేజింగ్ రేటు' అని కూడా అంటారు.
- రెపోరేటు అనేది ఆర్థికవ్యవస్థలో నిధుల కొరత ఏర్పడినపుడు ఒకదేశం కేంద్ర బ్యాంకు వాణిజ్య బ్యాంకులకు రుణాలు ఇచ్చేరేటు.
- ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ద్రవ్య అధికారులు(ఆర్‌బీఐ) రెపోరేటును ఉపయోగిస్తారు.
- ద్రవ్యోల్బణ కాలంలో కేంద్ర బ్యాంక్ రెపో రేటును పెంచుతుంది. ఇది బ్యాంకులు కేంద్ర బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడానికి ప్రోత్సాహకంగా పనిచేస్తుంది. ఇది అంతిమంగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాను తగ్గిస్తుంది. తద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో సహాయ పడుతుంది.
- 2023 జూన్ 8న రెపోరేటును గతంలో ఉన్న రేటుకు 25 బేసిక్ పాయింట్లను పెంచింది. అంటే ప్రస్తుత రెపోరేటు 6.50 గా ఉంది.

**7. భారతదేశంలో ప్రస్తుత రివర్స్ రెపోరేటు ఎంత ఉంది? (బి)**

ఎ) 2.25 బి) 3.35
సి) 4.45 డి) 5.55

**వివరణ :** రివర్స్ రెపోరేటు, రెపోరేటులతో పాటు ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం, లిక్విడిటీని నియంత్రించడానికి ఆర్‌బీఐ అమల్లోకి తెచ్చే అతి ముఖ్యమైన ద్రవ్య సాధనాల్లో ఒకటి.

- రివర్స్ రెపోరేటు భావనను వాఘుల్ వర్కింగ్ గ్రూప్ సూచించింది.
- రివర్స్ రెపోరేటు భావనను ఆర్‌బీఐ 1996 నవంబర్ 1 నుంచి ప్రవేశ పెట్టినది.
- రివర్స్ రెపోరేటు అంటే షార్ట్ టర్మ్ బారోయింగ్ రేట్
- వాణిజ్య బ్యాంకులు కేంద్ర బ్యాంకుకు ఇచ్చే స్వల్పకాలిక రుణాలపై ఆర్‌బీఐ ఇచ్చే వడ్డీరేటును రివర్స్ రెపోరేటు అంటారు.
- రివర్స్ రెపోరేటు అనేది రెపోరేటుకు పూర్తిగా భిన్నమైనది
- రివర్స్ రెపోరేటు అనేది ఆర్‌బీఐ పాలసీ సాధనం
- రివర్స్ రెపోరేటు అనేది బ్యాంకులు ఆర్‌బీఐకి రుణంగా లేదా ఆర్‌బీఐలో డిపాజిట్‌గా రుణం ఇచ్చే రేటు.
- ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం, లిక్విడిటీని నియంత్రించడానికి ఆర్‌బీఐ రివర్స్ రెపో రేటు సాధనాన్ని అమలు చేస్తుంది.
- ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ పరిస్థితులు ఉన్నప్పుడు వాణిజ్య బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద ఎక్కువ అదనపు నిధులను ఉంచడం వల్ల ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరా తగ్గి ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది.
- ఆర్థిక వ్యవస్థలో ప్రతి ద్రవ్యోల్బణ/ ఆర్థిక మాంద్యం పరిస్థితులు ఉన్నప్పుడు వాణిజ్య బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద డిపాజిట్లను తగ్గించడం వల్ల, బ్యాంకులు ఎక్కువ రుణాలు ఇవ్వడం వల్ల ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరా పెరుగుతుంది.
- భారతదేశంలో ప్రస్తుతం రివర్స్ రెపోరేటు 3.35 శాతం ఉంది.

పానుగంటి కేశవ రెడ్డి
రచయిత
వైష్ణవి పబ్లికేషన్స్
గోదావరిఖని
9949562008

